క్లుప్తంగా

జూన్ ఒకటి నుంచి మహాకుంభాభిషేకం



పెదకాకాని: శివాలయంలో జూన్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పీఠాధిపతుల పర్యవేక్షణలో మహా కుంభాభిషేకానికి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను బుధవారం ఆహ్వానించారు. ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం క్రతువుకు సంబంధించిన పనులు చేపట్టడం జరుగుతుందని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభం

కొమ్మూరు(కాకుమాను): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, సర్పంచి గేరా జ్యోతి భూమి పూజ చేశారు. గుల్జార్ బేగం మాట్లాడుతూ నాడు- నేడు ఫేజ్ ద్వారా పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.33 లక్షల వ్యయంతో మూడు అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి గేరా జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు గేరా పున్నారావు,ముజావర్ షేక్ అసదుల్లా, వైస్ సర్పంచి, పీఎంసీ చైర్మన్ షేక్ జిలేఖ, హెచ్ఎం .శ్రీనివాసరావు, తన్నీరు సుబ్బారావు పాల్గొన్నారు.

కాకుమానులో భారీ వర్షం



కాకుమాను: మండలంలోని గ్రామాలలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో పలు గ్రామాలు వర్షపు నీటితో నీటమునిగాయి. మండల కేంద్రం కాకుమానులో కురిసిన వర్షానికి కాకుమాను బాపట్ల ప్రధాన రహదారి సుమారు వంద మీటర్లకు పైగా నీటితో మునిగిపోవడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు.

చలివేంద్రం ప్రారంభం

పొన్నూరు(చేబ్రోలు): ప్రయాణికులు, వాహనదారుల దాహార్తి తీర్చటం కోసం పోలీసు చలివేంద్రంను ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ పి.ప్రభాకరరావు తెలిపారు. పొన్నూరు రూరల్ మండల పరిధిలోని దొప్పలపూడి అడ్డరోడ్డు ప్రాంతంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గుంటూరు ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు దొప్పలపూడి అడ్డరోడ్డు వద్ద చలివేంద్రంను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్ఐ భార్గవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తులు

ప్రత్తిపాడు: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టును భర్తీ చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి పథకం అధికారి వి.సుజాతదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం వట్టిచెరుకూరు మండలం వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ సెంటరు ఆయా పోస్టు ఓసీ జనరల్ కేటగిరీకి రిజర్వు అయినట్లు సీడీపీఓ తెలిపారు. అర్హులు ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు. అభ్యర్థులు 2022 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు వయస్కులై ఉండటంతో పాటు స్థానిక నివాసితురాలై, వివాహిత అయ్యి, ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాన్నారు. మరిన్ని వివరాలకు ప్రత్తిపాడు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని సుజాతదేవి కోరారు.

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం మెయిన్ సెంటర్‌లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ కేటగిరికి చెందిన వారు అర్హులని తెలిపారు.



రాజధాని పేరుతో దోపిడీకి పాల్పడిన టీడీపీ

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

పొన్నూరు(చేబ్రోలు): తెలుగుదేశం ప్రభుత్వం రాజధాని పేరుతో దోపిడీకి పాల్పడి, విచారణ కమిటీ వేస్తే స్టే తెచ్చుకున్న ఘనులు తెలుగుదేశం పార్టీ నాయకులు అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి పేరుతో గ్రాఫిక్స్ చేసి టీడీపీ నేతలు దోచుకున్నారన్నారు. రాజధాని ఏర్పాటుకు 2 వేల ఎకరాలు అవసరం కాగా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 52 వేల ఎకరాలు భూమి సేకరించి ప్రపంచంలోనే కుబేరుడు కావాలని అత్యాశతో రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. రాజధాని అమరావతిని సింగపూర్‌గా, జపాన్, టోక్యోగా చేస్తానని ప్రజలను నమ్మించి భ్రమరావతిగా చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తూ పత్రిక స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కక్ష కట్టి విషం చిమ్ముతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ వ్యాపారాలు లేని ధూళిపాళ్ల ఇన్ని వేల కోట్లు రూపాయలు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. చంద్రబాబు అనుభవం అంతా ప్రజలను దోచుకోవటానికే సరిపోయిందన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అమిరినేని సాంబశివరావు, బొద్దులూరి రంగారావు, సయ్యద్ సుభాని, ఇందేటి వెంకటసుబ్బయ్య, మల్లెల రాజు, నాగిశెట్టి నరసింహ, గాజుల సత్యనారాయణ, శ్రీధర్, షేక్ నయిం బాషా, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

చేబ్రోలు: మండలం వేజండ్ల ప్రాంతానికి చెందిన పది కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పొన్నూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పార్టీ కండువాలను కప్పి వారిని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జనరంజక పాలనకు ఆకర్షితులై వేజండ్ల దళితవాడ ప్రాంతానికి చెందిన పులి మధు, చింతలచెరువు కాంతారావు, వేజెండ్ల అఖిల్ తదితర పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ నాయకులు కాసు ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ శనగల వెంకటరెడ్డి, పఠాన్ మగ్బుల్‌ఖాన్, ప్రేమ్‌బాబు, ఎం.పోతురాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ మహిళా డ్రెయిరీ కేంద్రం నూతన భవనాల, సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లను లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని జగనన్న సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం, ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కార్యక్రమం పేదలకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వివరించారు. మహిళా డెయిరీల ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయన్నారు. తురకపాలెంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం గతంలో జరిగిందని, అదేవిధంగా నేడు రూ.93 లక్షలతో రైతు భరోసాకేంద్రం, విలేజ్ క్లినిక్, మహిళా డెయిరీలను నిర్మించుకుని ప్రారంభించుకోవటం జరిగిందన్నారు. అదే విధంగా రూ. 28.16 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి డబ్బూరి సూర్యప్రకాశరావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, ఆర్ అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, పార్టీ మండల కన్వీనర్ ఆళ్ళ రవిదేవరాజు, సొసైటీ చైర్మన్ దుగ్గింపూడి భూపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్, శ్రీనివాసరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, తంగెళ్ళ నాగేశ్వరరావు, దాసరి నాగరాజు, రామకోటేశ్వరరావు, ఎదురుపాక వెంకట్, ఎంపీడీఓ శోభారాణి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కంచర్ల'కు దిలీప్.ఆర్.బల్లాల్ అవార్డు



కంచర్ల రఘు వీర మణికంఠచారి

పొన్నూరు(చేబ్రోలు): అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్, ఇంటర్నేషనల్ గ్యాస్ టర్బైన్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్ టర్బైన్ రంగంలో విశేష కృషి చేసిన యువ శాస్త్రవేత్తలకు ప్రదానం చేసే దిలీప్.ఆర్.బల్లాల్ అవార్డు తెలుగు శాస్త్రవేత్త పొన్నూరుకు చెందిన డాక్టర్ కంచర్ల రఘు వీర మణికంఠచారిని వరించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పోటీ ఉండే ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఏటా ఒక్కరిని ఎంపిక చేస్తారు.

పొన్నూరు పట్టణం పాత పొన్నూరుకు చెందిన అయ్యప్ప గురుస్వామి కంచర్ల ధనుంజయాచారి కుమారుడు. డాక్టర్ మణికంఠకు అవార్డు దక్కింది. పట్టణంలోని ఐడియల్ కాన్వెంట్‌లో ఇంటర్ వరకు విద్యనభ్యసించిన మణికంఠ, చెన్నై ఐఐటీలో బీటెక్ మరియు ఎం.టెక్ పూర్తి చేసుకుని అనంతరం అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని పవర్ సిస్టమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐడియల్ పూర్వ విద్యార్థికి అవార్డు రావటంపై కాన్వెంట్ ప్రిన్సిపాల్ రావులపల్లి ఉషారాణి హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్‌గా జొన్నల అవినాష్‌రెడ్డి

పెదకాకాని: రాష్ట్ర రెడ్డి కార్పోరేషన్ డైరెక్టర్‌గా జొన్నల అవినాష్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఏర్పాటు చేయబడిన రెడ్డి కార్పోరేషన్‌లో ఆరుగురు డైరెక్టర్‌లతో పాటు చైర్మన్‌ను ఎంపిక చేయడం జరిగింది. తాజాగా మరో ఆరుగురు డైరెక్టర్లను నియమించడం జరిగింది. ఆ ఆరుగురు డైరెక్టర్లలో పెదకాకాని మండలం, నంబూరు గ్రామానికి చెందిన జొన్నల అవినాష్‌రెడ్డి ఉన్నారు. పార్టీ అభివృద్ధికి చేసిన శ్రమను గుర్తించి తన నియామకానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు, ప్రభుత్వానికి జొన్నల అవినాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బాకీ డబ్బులు ఇవ్వలేదని దాడి

పెదకాకాని: వడ్డీకి తీసుకున్న డబ్బులు చెల్లించలేదని కొట్టి గాయపరచిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ బాబు బాజీబాబా దర్గా సమీపంలో టైలరింగ్ చేస్తూ, భార్య ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వంశీ వద్ద వారాల లెక్క ప్రకారం చెల్లించే విధంగా 5 వేల రూపాయలు నగదు తీసుకున్నారు. వారానికి 500 రూపాయల చొప్పున 12 వారాలు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ 26వ తేదీ ఊరికి వెళ్ళేందుకు గుంటూరు ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఉండగా వంశీ, షేక్ నాగూర్ బీ అక్కడికి వెళ్ళి ఇంటికి తీసుకొచ్చారు. ఎక్కడికి వెళుతున్నావురా అంటూ బూతులు తిట్టడంతో పాటు రాడ్డుతోనూ, కాళ్లతో, చేతులతో కొట్టి గాయపరచాడు. అడ్డు వచ్చిన భార్యను కూడా అసభ్యంగా తిట్టారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం పెదకాకాని పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. బాధితుడు షేక్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

గిన్నిస్ బుక్‌లో నాగశ్రీకి స్థానం



వరల్డ్ రికార్డు అవార్డు అందుకున్న నాగశ్రీ వేదప్రణవి

తెనాలి టౌన్: తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మల్లిశెట్టి నాగశ్రీవేదప్రణవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెలలో నిర్వహించిన భగవద్గీత మహా పారాయణంలో 10-13 సంవత్సరాల విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని ప్రణవి సాధించింది. విశ్రాంత ఉపాధ్యాయులు, దివంగత మల్లిశెట్టి సుబ్బారావు కుమారుడు మల్లిశెట్టి కుమార్ వ్యాస్, శిరీష దంపతులు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. వీరి కుమార్తె వేదప్రణవి, గణపతి సచ్చిదానంద స్వామి నుంచి అవార్డు అందుకున్నట్లు వ్యాస్ తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదు చేసుకున్న కొలకలూరు నుంచి మొదటి చిన్నారి కావడం విశేషం. గత ఆరు సంవత్సరాల నుంచి కుమార్ వ్యాస్ దంపతులు అమెరికాలో ఉంటున్నారు. గిన్నిస్ బుక్ రికార్డులో పేరు నమోదు చేసుకోవడంపై వేద ప్రణవిని గ్రామంలోని పలువురు అభినందించారు. అభినందించిన వారిలో గ్రామ మాజీ సర్పంచులు ఉన్నం ఫకీల, వల్లూరు వరప్రసాద్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, తోట నాగేశ్వరరావు, బండి శ్రీనివాస్, పొన్నెకంటి సాంబశివరావు, మంచికలపూడి వెంకటేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

పెదకాకానిలో బంగారం ఆభరణాలు చోరీ

పెదకాకాని: ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు దోచుకు పోయిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. పెదకాకాని కాలనీకి చెందిన మోహన్ దంపతులు మంగళవారం రాత్రి తలుపు గడియ వేయకుండా నిద్రపోయారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బంగారం ఆభరణాలు దోచుకెళ్లారు. బుధవారం ఉదయం ఇంట్లోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లు గుర్తించిన ఆ దంపతులు బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని తెలుసుకున్నారు. బాధితులు పెదకాకాని పోలీసులను ఆశ్రయించారు.

కల్లాల్లో తడిసి ముద్దవుతున్న మిర్చి



కల్లాల్లో పట్టాలపై నిలిచిన నీటిని బయటకు పంపుతున్న రైతు



వెనిగండ్ల జొన్నలగడ్డరోడ్డులో...

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలు మిర్చి రైతుకు కంటగింపుగా మారాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వీస్తున్న గాలులతో మిర్చి రైతులకు కంటి మీద కునుకు కరువయింది. బుధవారం ప్రత్తిపాడు మండలంలో వాన కుమ్మేసింది. ప్రత్తిపాడులో 50 మిలీమీటర్ల వర్షపాతం నమోదైంది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతన్నలు పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. భారీ వర్షం ధాటికి కల్లాల్లో మిర్చి పట్టాలపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుకునేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. స్పాంజ్‌లతో నీటిని బయటకు పంపుకున్నారు. తడిసిన మిర్చిని ఆరబెట్టుకున్నారు. గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డు భారీ వర్షం ధాటికి జలమయమయ్యింది. రోడ్డుపై వర్షపు నీరు నిలిచి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అకాల వర్షాలతో మిర్చి రైతుకు కష్టాలు

పెదకాకాని: అకాల వర్షాలతో మిర్చి రైతులు అల్లాడుతున్నారు. కల్లాల్లో మిరపకాయలు ఎండుతున్న సమయంలో కురిసిన వర్షాలకు మిరపకాయలను కాపాడుకోవడం కోసం వర్షంలో తడుస్తూనే అవస్థలు పడ్డారు. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మబ్బులు కమ్మి వర్షపు జల్లులు ఏదో ఒక సమయంలో పడుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం పెద్ద వర్షం పడటంతో మిరపకాయలు ఆరుతున్న కల్లాలు బురదమయంగా మారాయి. కాయలపై పట్టాలు కప్పి కాపాడుతున్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల, కొప్పురావూరు, తక్కెళ్ళపాడు, పెదకాకాని గ్రామాలలో సాగులో ఉన్న మిరపకాయలు చివరి దశ కోతలు కోస్తున్నారు. ఈ ఏడాది మిరపకాయల ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. వారం రోజులుగా పలువురు రైతులకు చెందిన మిరపకాయలు కల్లాల్లో ఎండుతున్నాయి. వర్షానికి కాయలు తడవకుడా ఉండేందుకు కల్లాల వద్దనే కాపాలాకాస్తున్నారు. రబీ సాగులో భాగంగా సాగు చేసిన మొక్కజొన్న, జొన్నలు కూడా పలు గ్రామాలలో కల్లాల్లో ఆరుతున్నాయి. వర్షం ఎప్పుడు ఆగిపోతుందా పండిన పంట తడవకుండా ఇంటికి చేర్చుకుందామని రైతులు కల్లాల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. మిరపకాయలు కోతలకు వెళ్లిన కూలీలు వర్షానికి తడిసి మధ్యలోనే ఇళ్లకు చేరుతున్నారు.

అమ్మవారికి లక్ష మల్లెతో పూజ



పెదనందిపాడు: వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి లక్ష మల్లెపూల పూజ ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని నాగులపాడు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మల్లెపూల పూజ ఘనంగా నిర్వహించారు.

చెరువులో పడి యువకుడి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన పల్లా

పెదకాకాని: చేపలు పడుతూ ఫిట్స్ వచ్చి చెరువులో పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొప్పురావూరులో చోటుచేసుకుంది. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన పల్లా సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులకు త్రిభూషణరావు, వెంకట శివ దుర్గారావు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు వెంకట శివ దుర్గారావు 11 సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన ఇంటి ముందుకు ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు కూర్చున్న సమయంలో ఫిట్స్ రావడంతో ముందుకు పడి నీట మునిగాడు. అదే సమయంలో అటు వైపు వెళుతున్న వారు చూసి చెరువులో దూకి బయటకు తీశారు. తండ్రికి సమాచారం అందించడంతో గుంటూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న పల్లా వెంకట శివదుర్గారావు(18) పరిస్థితి విషమించి మరణించాడు. తండ్రి పి.సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ ధ్యేయం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- జడవల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



జడవల్లిలో పథకాలపై మహిళకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి

జడవల్లి(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయటమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు రూరల్ మండలం జడవల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు కులమత వర్గ రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం....

జడవల్లిలో రూ.22 లక్షల పీఎంఏజీవై నిధులతో నిర్మించనున్న సిమెంటు మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామ సర్పంచి పిల్లి ఇందిరా ప్రియదర్శిని, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి మాణిక్యరావు, కర్లపూడి ఎలీషా, మిక్కిలి మరియదాసు, తాడికొండ శ్రీనివాసరావు , జూపూడి చిన్న సుబ్బారావు, పెరికల కృష్ణమోహన్, గూడవల్లి గంగాధర్, ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసభ్యంగా మాట్లాడి బెదిరించడంపై కేసు

పెదకాకాని: పొలం వ్యవహారంలో అసభ్యంగా మాట్లాడి బెదిరించడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం.. ఉప్పలపాడు గ్రామానికి చెందిన దంతాల గోపాలరావు తనకు ఉన్న మూడు ఎకరాల భూమిని ఇద్దరు కుమారులు దంతాల నారాయణరావు, వెంకయ్యలకు సమానంగా పంచి పెట్టాడు. పెద్ద కుమారుడు నారాయణరావు గ్రామంలోనే మరొక వ్యక్తికి తన పొలాన్ని అమ్ముకున్నాడు. రెండో కుమారుడు వెంకయ్య తన కుమారుడు దంతాల వెంకట తిరుమల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ పొలంపై అమెరికా వెళ్లి చదువుకునేందుకు బ్యాంకు రుణం కూడా పొందారు. వెంకయ్య చనిపోవడంతో ఆయన భార్య వాసంతి ఆ పొలాన్ని గట్టినేని తేజకు కౌలుకు ఇచ్చి కుమారుడు వెంకట తిరుమల వద్దకు వెళ్లింది. ఆ తరువాత కొద్దిరోజులకే వాసంతి బావ నారాయణరావు, ఆయన కుమారుడు శ్రీకాంత్ పొలంలోకి చేరుకుని పైరును ట్రాక్టర్‌తో దున్ని స్వాధీనం చేసుకున్నారు. తేజ ద్వారా సమాచారం అందుకున్న వాసంతి తిరిగి ఉప్పలపాడు చేరింది. పొలం వద్ద ఉన్న బావ(పెద్ద మేనమామ), ఆయన కుమారుడు శ్రీకాంత్‌లను ఇదేమని నిలదీయడంతో అసభ్యంగా తిట్టడంతో పాటు బెదిరిస్తున్నారని బాధితురాలు వాసంతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారులు

ప్రత్తిపాడు: అకాల వర్షాలతో వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్ర బాట పట్టారు. నాలుగు రోజులు వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఒక మండలంలో ఉద్యానశాఖ అధికారులు, మరొక మండలంలో వ్యవసాయశాఖ యంత్రాంగం గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటల దిగుబడులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, లేమల్లెపాడుల్లో జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్ సుజాత మిర్చి కల్లాల్లో ఆరబోసిన మిర్చిని పరిశీలించి, తగు సలహాలు, సూచనలు అందజేశారు. వెంట హెచ్‌వో బేబి తదితరులున్నారు.

– అదే విధంగా ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి వంగిపురంలోని మొక్కజొన్న కల్లాలను పరిశీలించారు. తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు.ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాల వలన మండలంలో ప్రాథమికంగా 170 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం చేకూరిందన్నారు. కల్లాల్లో ఆరబోసిన దిగుబడులు తడిసిపోయాయని ఏఓ వివరించారు.

నల్లపాడు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

గుంటూరు రూరల్: సౌత్ జోన్ డీఎస్పీ మహమ్మద్ మహబూబ్ బాషా బుధవారం అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నేరాలు, శాంతి భద్రతలను గురించి విచారించారు. ఆయన స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్తుల కదలికలపై నిత్యం నిఘాను పెంచాలని సిబ్బందికి సూచించారు. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు నిఘాలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

